క్లుప్తంగా

రాజకీయంగా ఎదుర్కోలేకే అక్రమ కేసులు

ఇల్లంతకుంట: రాజకీయంగా ఎదుర్కోలేక తమ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మానకొండూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. ఇల్లంతకుంట మండల బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. కార్ రేస్‌లో తమ నాయకుడు కేటీఆర్‌ను ఏ వన్‌గా చేర్చి కేసు నమోదు చేయడం సిగ్గుచేటని అన్నారు. మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, కేవీఎస్‌రెడ్డి, తడకపెల్లి భూమయ్య, ఇల్లంతకుంట మాజీ ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను ముట్టుకుంటే అగ్ని గుండమే..

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను ముట్టుకుంటే అగ్ని గుండమే అవుతుందని సీనియర్ ఉద్యమకారుడు అందె సుభాష్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడాదికాలంగా కాంగ్రెస్ పార్టీ దుర్మార్గ పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టించి, జైలుకు పంపించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టుతూ ప్రజల ముందు ఉంచుతున్నందుకు కక్ష కట్టి కేసులు పెడుతున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు, మహిళలకు రూ.2,500 ఏమయ్యాయని ప్రశ్నించారు. గురుకులాల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో మరణిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మాజీ వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్, పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్, నరసింహులు, మాజీ సర్పంచ్ తిరుపతి, నాగరాజు, సీత్యానాయక్, ఎనగందుల బాబు, జుబేర్ పాల్గొన్నారు.

గణిత దినోత్సవం

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు గణిత గుర్తులు, సూత్రాలతో గణిత ముగ్గులు వేశారు. నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు.

లోన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సిరిసిల్లఎడ్యుకేషన్: వాహన కొనుగోలుదారులు సంస్థలు అందించే లోన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్లలోని కాకతీయ టయోటా గ్రామీణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా గంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు

సిరిసిల్లకల్చరల్: కుట్టు మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ముస్లిం మైనారిటీ మహిళలు ప్రత్యక్షంగా దరఖాస్తులివ్వాల్సిన అవసరం లేదని మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అభివృద్ధి అధికారి వి.రాధాబాయి తెలిపారు.

ఇందిరమ్మకాలనీలో వైద్యశిబిరం

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలతో తంగళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిక్షయ్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ అధికారిణి డాక్టర్ స్నేహ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి గాలి తుంపర్ల ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు సోకే ప్రమాదముందన్నారు. డీపీపీఎం కోఆర్డినేటర్ బిగిందర్, ఎస్టీఎస్ జేత్య, హెచ్‌వీ ప్రమీల, సూపర్‌వైజర్ సతీశ్, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఎల్లారెడ్డిపేట: మండల పరిధిలోని సెస్ అధికారులు, సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. రాచర్లగొల్లపల్లి దేవునిగుట్టతండా పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ లింకు పోయి నాలుగు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నాయకులు గుండాడి రాంరెడ్డి, రాజేందర్, గౌస్, రాజునాయక్, భాస్కర్, బండారి బాల్‌రెడ్డి, రవి, మూన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని హార్ట్‌ఫుల్‌నెస్ నిర్వాహకుడు మంచాల గణేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు విద్యార్థులకు నిర్వహించే యోగా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వనజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శంకుస్థాపన చేశారు. పాల రాతితో ఆలయాన్ని ఆధునిక హంగులతో నిర్మించనున్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో పనులు జరగనుండగా, రాతితో శిల్పాలను చెక్కి పిల్లర్లతో నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రాజస్థాన్‌లో ప్రత్యేకంగా ఎల్లమ్మ విగ్రహం తయారు చేయిస్తున్నారు. రాతితో ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించడం ఓ ప్రత్యేకతగా భావిస్తున్నారు.



కల్వర్టు నీటికి దారేది..

ముస్తాబాద్: ముస్తాబాద్–నామాపూర్ ఆర్‌అండ్‌బీ రహదారిలో కల్వర్టు చుట్టు మట్టి పోశారు. భారీ వర్షాలకు వచ్చే వరద నీటికి దారి లేకుండా చేశారని రైతులు పేర్కొంటున్నారు. వర్షం నీరు వెళ్లకుండా మట్టి పోయడంతో రోడ్డుపై నీరు నిలిచే ప్రమాదముంది. నీరు పోయేలా దారి వదిలితే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆలయాల అభివృద్ధికి కృషి

ముస్తాబాద్: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ముస్తాబాద్ మాజీ సర్పంచ్ వారగంటి తిరుపతి అన్నారు. ముస్తాబాద్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ భవన్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సద్గుణాచారి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీను పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



కోనరావుపేటలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోనరావుపేట: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఏకవచనంతో మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను మాల మహానాడు ఆధ్వర్యంలో దహనం చేశారు. మండల అధ్యక్షుడు మాందాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాసం జనార్దన్, మాదం నర్సయ్య, మాదాస్ భూమయ్య, యాసరాజం, కులేరు రవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: అమిత్‌షా ఎంపీ పదవికి రాజీనామా చేయాలని బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వేములవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మధు, నాగరాజు, సాయి, ప్రశాంత్, వంశీ, వినోద్ తదితరులున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. చిట్ల శ్రీనివాస్, రోమాల ప్రవీన్, సాగర్, దినేశ్, శ్రీకాంత్, ప్రణయ్, సాయి, అజయ్, రాజేందర్, వంశీ తదితరులున్నారు.

సిరిసిల్లటౌన్: అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, మూషం రమేశ్, రాగుల రాములు, సూరం పద్మ, మందా అనిల్, గణేశ్, కుర్ర రాకేశ్, రమేశ్‌చంద్ర, గుండెల్లి కళ్యాణ్, సాయి, భరత్, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అమిత్‌షా రాజీనామా చేయాలని ఆవునూర్‌లో ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. గుండం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: అమిత్‌షా దిష్టిబొమ్మతో బస్టాండ్‌లో మాల మహానాడు జిల్లా కన్వీనర్ సిరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చందుర్తి ప్రొబెషనరీ ఎస్సై అనిల్‌తోపాటు పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. బత్తుల కమలాకర్, వెల్పుల దేవస్వామి, అసినిపర్తి సురేశ్, మెడికాల తిరుపతి, మదాసు స్వామి, రొండి దేవయ్య, ఈసరి దేవదాసు, ఎడ్ల లింగయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్కం బాబు డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ నాయకుల విలేకరుల సమావేశంలో బాబు, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ గిరిజన కోఆర్డినేటర్ భూక్యా గజన్‌లాల్‌నాయక్ మాట్లాడారు. భూక్య మదన్‌లాల్, భూక్య సంతోష్,, గుగులోతు లచ్చిరాం, దేవరాజు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: అమిత్‌షాను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన కమ్యూనిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మోర అజయ్ అన్నారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఆరా



జెబల్‌సిఫాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులతో కృష్ణారెడ్డి

- మస్కట్‌లో పర్యటించిన ఎల్లారెడ్డిపేట పాక్స్ చైర్మన్

ఎల్లారెడ్డిపేట: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారి సమస్యలు తెలుసుకునేందుకు ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఒమన్ దేశంలో పర్యటించారు. వారం రోజులుగా ఒమన్ రాజధాని మస్కట్ నగరంలో పర్యటిస్తున్న కృష్ణారెడ్డి అక్కడ వివిధ కంపెనీల్లో పని చేస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన వలస కార్మికులను కలిశారు. వారు చేస్తున్న పని, వస్తున్న వేతనం, అక్కడ కంపెనీలు కల్పిస్తున్న సౌకర్యాలు, మన ప్రభుత్వం ద్వారా వారు కోరుకుంటున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. మస్కట్‌తోపాటు జెబల్‌సిఫా పట్టణంలో పర్యటించారు. అక్కడ ఉద్యోగాలు చేస్తున్న ఎన్ఆర్‌ఐలు కొండేటి దేవేందర్, ఎలుసాని సునీల్, స్వామితోపాటు వారి కంపెనీలో పని చేస్తున్న ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన గల్ఫ్ కార్మికులను కలిశారు.

యజమానుల బెదిరింపులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రవి

సిరిసిల్లటౌన్: గత ప్రభుత్వ హయాంలో అత్యధిక లాభాలు గడించిన కొందరు యజమానులు ప్రస్తుతం సిరిసిల్లలోని ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో నిర్వహించిన ప్రెస్ మీట్లో మాట్లాడారు. ఆసాములతో యజమానులు మాట్లాడుతూ మీరు స్వతహాగా ఆర్డర్లు తీసుకురండి కానీ గతంలో మాదిరిగా లాభాలను మాకే ఇవ్వాలని ఒత్తిడికి గురి చేస్తూ వారి నుంచి ప్రామిసరీ నోట్లు రాయించుకోవడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. ఈ విషయాలపై చేనేత శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజు, సదానందం, నాగరాజు, నరసయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్మికుల ముందస్తు అరెస్టు



వేములవాడ: పోలీస్ స్టేషన్‌లో నాయకులు

వేములవాడ: చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా వేములవాడ ఆటో యూనియన్ నాయకులు, కార్మికులను స్థానిక పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు, యూనియన్ మాజీ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి బొజ్జ సుకుమార్, నాయకులు గుడిసె వాసు, సయ్యద్ ఉమర్, మహ్మద్ రఫీక్‌లను అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు ఏర్పాటు చేయడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

ఇల్లంతకుంట: మండల ఆటో యూనియన్ నాయకులను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇల్లంతకుంట మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్, పెద్ద లింగాపురం అడ్డా అధ్యక్షుడు రాజు, బెజ్జంకి అడ్డా యూనియన్ అధ్యక్షుడు సాయి ఉన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలి

ఇల్లంతకుంట: సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓల్డ్ పెన్షన్ పథకం పునరుద్ధరించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీపీఎస్ అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణరెడ్డి కోరారు. శుక్రవారం వెల్జిపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గొర్లు, పొట్టేలు మార్కెట్ ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: దుమాల ఏకలవ్య గురుకులం పాఠశాల సమీపంలో శుక్రవారం గొర్లు, పొట్టేలు అమ్మకాల మార్కెట్‌ను ప్రారంభించారు. దుమాల గ్రామానికి చెందిన రవి గొర్లు, పొట్టేల దుకాణం అందుబాటులోకి తెచ్చారు. ఇంతకాలం అందుబాటులో మార్కెట్ లేక శుభకార్యాలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు.

నియామకం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కోనరావుపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా కీసరి శ్రీనివాస్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా జాగిరి కిరణ్‌గౌడ్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు మ్యాక పర్శరాములు నియామక పత్రాలను అందజేశారు.

గౌడ సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో గౌడ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ స్వామిగౌడ్, ఉపాధ్యక్షుడిగా కొండ పెద్ద నర్సయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పందిర్ల రవికాంత్‌గౌడ్, కోశాధికారిగా ఆకుల నాగభూషణంగౌడ్, సలహాదారులుగా పాముల లక్ష్మణ్‌గౌడ్, పందిర్ల గణపతిగౌడ్, కొండ చిన్న నర్సయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్, దశరథంగౌడ్ ఎన్నికయ్యారు.

డీవైడీఎంకు 25 వినతులు

సిరిసిల్లటౌన్: డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు సిరిసిల్ల ఆర్టీసీ డీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన డీవైడీఎం కార్యక్రమానికి సిరిసిల్ల డిపో పరిధిలోని గ్రామాల ప్రయాణికుల నుంచి 25 విజ్ఞప్తులు వచ్చినట్లు చెప్పారు. వాటిలో ముఖ్యంగా ఏడుపాయలకు బస్సులు నడపమని, ముచ్చర్ల, రామోజీపేట గ్రామాలకు బస్సు కావాలని, కొత్త బస్టాండ్‌కు బస్సులు రావాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మేనేజర్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తులను పంపించి పరిష్కరిస్తామని తెలిపారు.

యువతరం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి



వేములవాడ: యువతరం కొత్త ఆలోచనలతో ఉపాధి పొందుతూ మరింత మందికి ఉపాధి కల్పించే దిశలో అడుగులు వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన సెలూన్‌ను శుక్రవారం ప్రారంభించారు. పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా సెలూన్‌ను ఏర్పాటు చేయడం బాగుందని నిర్వాహకులు మొట్టల మహేశ్‌ను అభినందించారు.

ఆలయానికి గ్రానైట్, గేట్ వితరణ

తంగళ్లపల్లి: గోపాలరావుపల్లెలో మాతమ్మ ఆలయానికి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మిరాల భాస్కర్‌యాదవ్ శుక్రవారం గ్రానైట్‌తోపాటు గేట్‌ను వితరణ చేశారు. నాయకులు గుండు ప్రేమ్‌కుమార్, గౌడ సంఘం అధ్యక్షుడు రంగు దేవేందర్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మునిగె దేవయ్య, మాజీ ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: వల్లంపట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అండర్–14 విభాగంలో మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో విభాగానికి ఎంపికయింది. జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు జిల్లాలో నిర్వహిస్తున్నారు. రిశ్విత జావెలిన్‌త్రో అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్ తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బోయినపల్లి: వేములవాడ డిపో నుంచి స్తంభంపల్లి, బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి, నల్లగొండ, జగిత్యాల మీదుగా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని బోయినపల్లి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తదితరులు శుక్రవారం వేములవాడ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వేములవాడ నుంచి రామన్నపేట, దేశాయిపల్లి, బోయినపల్లి గ్రామాల మీదుగా గంగాధర వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, నాయకులు మండల శ్రీనివాస్, దిలీప్‌రెడ్డి తదితరులున్నారు.

మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలి

ఎల్లారెడ్డిపేట: మొక్కల సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, నాటిన ప్రతి మొక్కను బతికించాలని ఎంపీడీవో సత్తయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లోని బొల్లం రాధాకృష్ణగౌడ్ ఇంటి వద్ద శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని సెస్ అధికారులు శుక్రవారం తొలగించి దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సాక్షి దిన పత్రికలో శుక్రవారం వచ్చిన కథనానికి సెస్ అధికారులు స్పందించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విలేకరికి పరామర్శ



బావుసాయిపేటలో పరామర్శిస్తున్న పేపర్ డిస్ట్రిబ్యూటర్లు

కోనరావుపేట: సాక్షి సిరిసిల్ల ఆర్సీ ఇన్‌చార్జి వూరడి మల్లికార్జున్‌ను జిల్లా న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్లు శుక్రవారం పరామర్శించారు. మల్లికార్జున్ తల్లి రామవ్వ ఇటీవలే మృతిచెందింది. న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు యెల్లె రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రాజు, తడుక చంద్రశేఖర్, గూడెల్లి నాగభూషణం, రాగుల వేణుగోపాల్, వెంగళ శ్రీకాంత్, చిట్యాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారులు వసంతరావు, పెంచలయ్య, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య తదితరులు పరామర్శించారు.

గంభీరావుపేట: తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం తండ్రి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శుక్రవారం పరామర్శించారు. బండ రమేశ్, మల్యాల రాజవీర్, ఎడబోయిన రాజు, పిట్ల రఘు, శ్రీనివాస్, బాబు, గంధ్యాడపు రాజు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బద్దెనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రెడ్డి సంఘం మండల మాజీ అధ్యక్షుడు కూర శంకర్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి పరామర్శించారు. తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట: ఓ యువకుడు తనను కులం నుంచి బహిష్కరించారని ఆవేదనతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనను చిత్రహింసలకు గురి చేశారని పేర్కొంటూ ఆత్మహత్యాయత్నాన్ని వీడియో తీయగా.. అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను ఉరేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియోతో తనను కుల బహిష్కరణ చేశారని మొర పెట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొర్రి రమేశ్(45)ను మూడు సంవత్సరాలుగా కుల సభ్యులు మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తున్నారు. కుల బహిష్కరణ చేసి ఆడుకుంటున్నారని రమేశ్ ఆరోపించాడు. తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన కుల పెద్దలు కొత్త మల్లయ్య, లింగాల దాస్, లింగాల సన్నీ, లింగాల రామచంద్రం, కొత్త శ్రీనివాస్, కొత్త బాబు, బుర్క ధర్మేందర్, గడ్డం జితేందర్‌తోపాటు మరికొంత మందిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్‌లకు సెల్ఫీ వీడియోలో కోరాడు.

గడ్డం జితేందర్, బుర్క ధర్మేందర్, లింగాల సందీప్, కొప్పరి రమేశ్, లింగాల దాసు, రేసు శంకర్, మంగురపు అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు. ఎస్సై వివరాల ప్రకారం.. కొర్రి రమేశ్, కొత్త అరుణ్‌కు భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై కులంలో పంచాయితీ జరిగింది. కుల పెద్దల నిర్ణయంతో తనకు న్యాయం జరగలేదని కొర్రి రమేశ్ వారి తీర్పును అంగీకరించలేదు. దీంతో అప్పటి నుంచి కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు వారు నిర్ణయించారు. ఈక్రమంలో శుక్రవారం కులంలో చిట్టీలో డబ్బులు చెల్లించేందుకు రమేశ్ వెళ్లగా.. కులస్తులు ఎవరూ మాట్లాడలేదు. కులం నుంచి బహిష్కరించామని, డబ్బులు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఈ విషయమై బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తి రిమాండ్

వేములవాడ: లారీ నంబర్ ప్లేట్ మార్చి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అనుముల భాస్కర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ శుక్రవారం తెలిపారు. నీలోజీపల్లికి చెందిన సదరు వ్యక్తి వేములవాడ టౌన్ స్టేషన్ పరిధిలో ఇసుక టిప్పర్ నంబర్‌తో అక్రమంగా ఇసుకను తరలించారని చెప్పారు. ఇప్పటికే భాస్కర్‌పై రాష్ట్రంలో అనేక ఇసుక అక్రమ తరలింపు కేసులు నమోదయ్యాయని తెలిపారు.

కలప రవాణా చేసిన వ్యక్తులపై కేసు

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన శివరాత్రి దేవరాజు, అతడి తండ్రి శివరాత్రి రాములు కలిసి గురువారం ఎడ్ల బండిలో టేకు దుంగలను తరలిస్తుండగా.. అటవీ అధికారులు పట్టుకున్నారు. అధికారులను నెట్టి పారిపోగా.. అధికారుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ముస్తాబాద్: మద్దికుంట శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసినట్లు చెప్పారు. రూ.9,400తోపాటు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ఇల్లంతకుంట: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏడుగురు లబ్ధిదారులకు సుమారు రూ.2లక్షల విలువ గల చెక్కులను అందించారు.